RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శనివారం 27-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 271 | పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
అర్హతలు:
- పత్రికారంగంలో ఆసక్తి కలిగి ఉండాలి.
- తెలుగు భాషపై పట్టు ఉండాలి.
- రిపోర్టింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.
- స్థానిక సంఘటనలు వెలికితీసే అవగాహన ఉండాలి.
- సమాజ సేవ చేయగల ఉత్సాహం ఉండాలి.
- అనుభవం లేనివారికి శిక్షణ ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386

## రేపు మార్కాపురం జిల్లాకు
## సీఎం చంద్రబాబు..

- శనివారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ, వారితో సమావేశం
- గిద్దలూరులో సంజీవిని ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- సీఎం పర్యటన సందర్భంగా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం (జూన్ 2) మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన కీలకమైన వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించడంతో పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం 9:55 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం చంద్రబాబు, 10:45 గంటలకు మార్కాపురం

2లో



## మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- సమీక్షలో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి
- నెక్లెస్ రోడ్డులో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై సమీక్ష



## ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- వాతావరణ మార్పుల ప్రభావంతో ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు
- ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు
- పలు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రానున్న రెండు రోజులు వర్ష ప్రభావం
- ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



## కెమెరాలు కవర్ చేసి.. అందినంత కొట్టేసి..

- అయోధ్య విరాళాల స్కామ్ జరిగిన తీరిది
- ఆలయ లెక్కింపు గదిలో సిబ్బంది చేతి వాటం
- బ్యాంకులకు తరలించేటప్పుడూ దొంగతనం

2లో

# శిథిలాల కింద 45,000 మంది?



2లో

- వెనెజువెలాలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- 590కి పెరిగిన భూకంప మృతుల సంఖ్య
- 3,360 మందికి గాయాలు
- ఆత్మీయుల జాడ కోసం అనేక మంది అన్వేషణ
- ఆపరేషన్ అమిస్తాద్‌తో భారత్ ఆపన్నహస్తం



## రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు...

- బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం
- రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు
- 'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్
- రాహుల్ టూర్ల ఖర్చుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కమలదళం
- రాహుల్ ప్రపంచస్థాయి నాయకుడని కాంగ్రెస్ కౌంటర్

2లో

## ఏపీ సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి పోస్టింగ్.. రిటైర్మెంట్‌కు ముందు పోస్టింగ్ అందుకేనా?

2లో

- పదవీ విరమణకు నాలుగు రోజుల ముందు ఐఏఎస్ శ్రీలక్ష్మికి పోస్టింగ్
- స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- రెండేళ్లుగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న శ్రీలక్ష్మికి ఊరట
- కక్ష సాధింపులు ఉండవనే సంకేతాలు పంపిన ప్రభుత్వం
- గౌరవప్రదమైన పదవీ విరమణకు అవకాశం కల్పించిన సర్కార్



### పంచాయతీరాజ్ శాఖలో
## ప్రమోషన్ల పండగ..

- కీలక ఆదేశాలు జారీ చేసిన పవన్
- పంచాయతీ రాజ్‌శాఖలో మరోసారి ప్రమోషన్లు
- 42 మంది ఎంపీడీవోలకు డీడీవోలుగా పదోన్నతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక 10 వేల మందికి ప్రమోషన్లు
- వర్షాకాలంపై అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష
- సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం

2లో

## కాంగ్రెస్ పాలనలో ప్రజలకు నరకం

- వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సీఎం కావడం ఖాయం: కేటీఆర్
- పరిగిలో పార్టీ శ్రేణులకు 'సర్'పై అవగాహన



పరిగి: 'మోసపోతే గోస పడుతామని పరిగి గడ్డపై నిలబడి కేసీఆర్ ఆనాడే చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు నరకం



## తుంగభద్ర జలాలు రేవంత్ సర్కార్‌పై రాంచందర్ రావు ఫైర్

- తుంగభద్ర నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలన్న బీజేపీ
- తెలంగాణకు రావాల్సిన నీటిలో భారీగా కోత పడుతోందన్న రామచందర్ రావు
- సర్ ప్రక్రియపై అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యల మీద విమర్శ

తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టతనివ్వాలని

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# కాంగ్రెస్ పాలనలో ప్రజలకు నరకం

చూస్తున్నారు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగిలో 'సర్'పై నిర్వహించిన శిక్షణ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ రైతులకు పట్టాలిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్.. ఇప్పుడు పారిశ్రామిక పార్కుల పేరిట వేలాది ఎకరాలు లాక్కుంటున్నారని ఆరోపించారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కనీసం ధాన్యం కూడా పూర్తిగా కొనలేకపోతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరిపోయే దీపం లాంటివారని ఎద్దేవా చేశారు. రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి అరెస్టులు చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

**కమీషన్ల కోసమే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్..**

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తి చేశామని.. కానీ రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్ నిలదీశారు. ఉద్దండాపూర్ నుంచి గ్రావిటీ ద్వారా వికారాబాద్ జిల్లాకు కాల్వల ద్వారా నీటిని తీసుకురావచ్చని సిద్ధం చేస్తే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు కమీషన్లు, కుటుంబ సంపాదన కోసం రూ. 440 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పక్కన పెట్టారని దుయ్యబట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని.. రైతులకు పరిగితోపాటు కొడంగల్, జిల్లా మొత్తానికి సాగు నీరు అందించే బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పార్టీ నేతలు అనిల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శివనోళ్ల భాస్కర్, రాజిరెడ్డి, సురేందర్, అశోక్‌కుమార్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్

వాతావరణ మార్పుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రేపటి (శనివారం) నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ... రేపు ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కూడా రానున్న కొద్దిరోజుల పాటు ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తన నివేదికలో పేర్కొంది.ఆదివారం (జూన్ 28) కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు వివరించారు. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో ప్రజలు చెట్లు, హోర్డింగ్‌ల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీ సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి పోస్టింగ్..

# రిటైర్మెంట్‌కు ముందు పోస్టింగ్ అందుకేనా?



సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరో నాలుగు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఆమెను స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత రెండేళ్లుగా ఎలాంటి పోస్టింగ్ లేకుండా నిరీక్షిస్తున్న ఆమెకు ఈ నియామకంతో ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ నిర్ణయంతో ఆమె తన సర్వీస్‌ను గౌరవప్రదంగా ముగించేందుకు మార్గం సుగమమైంది. అఖిల భారత సర్వీస్ నిబంధనల ప్రకారం ఒక అధికారి సస్పెన్షన్‌లో లేనప్పుడు, పదవీ విరమణకు ముందు వారికి ఏదో ఒక పోస్టింగ్ ఇచ్చి గౌరవంగా పంపించాల్సి ఉంటుంది. ఈ నిబంధనను పాటిస్తూ ప్రభుత్వం శ్రీలక్ష్మికి పోస్టింగ్ ఇచ్చింది. తద్వారా తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడదని, నిబంధనల ప్రకారమే నడుచుకుంటుందని అధికారులకు స్పష్టమైన సంకేతాలు పంపింది. ఈ నిర్ణయం అధికార వర్గాల్లో ప్రభుత్వంపై సానుకూల దృక్పథాన్ని పెంచే అవకాశం ఉంది.

**పోస్టింగ్‌తో రిటైర్ అవడం ఎందుకు ముఖ్యం?**

ఒక అధికారి పదవిలో ఉండి రిటైర్ అవడానికి, పోస్టింగ్ లేకుండా రిటైర్ కావడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. పదవిలో ఉండి రిటైర్ అయితే, పదవీ విరమణ తర్వాత లభించే ప్రయోజనాలు, పెన్షన్, నో-డ్యూ సర్టిఫికెట్లు పొందడం సులభతరం అవుతుంది. అదే పోస్టింగ్ లేకుండా రిటైర్ అయితే, ఆర్థికంగా పెద్ద నష్టం లేకపోయినా ఈ పత్రాల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇది అధికారికి వృత్తిపరంగా అవమానకరంగా ఉంటుంది. ఒకవేళ అధికారిపై తీవ్రమైన అవినీతి లేదా క్రిమినల్ ఆరోపణలు ఉండి, సస్పెన్షన్‌లో ఉండగా రిటైర్ అయితే పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంటుంది. వారికి పూర్తి స్థాయి పెన్షన్ లభించదు, కేవలం తాత్కాలిక పెన్షన్ మాత్రమే అందుతుంది. శాఖాపరమైన విచారణ లేదా కోర్టు తీర్పులో నిర్దోషిగా తేలేంత వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలిచిపోతాయి.

**గతంలోనూ ఇలాంటి ఘటనలు**

గతంలో కూడా పలువురు సీనియర్ అధికారులు పదవీ విరమణకు ముందు పోస్టింగ్‌ల కోసం న్యాయపోరాటాలు చేసిన సందర్భాలున్నాయి. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సైతం పదవీ విరమణకు ఒక రోజు ముందు పోస్టింగ్ పొందారు. అయితే, దాని కోసం ఆయన కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. అదేవిధంగా సీనియర్ ఐఏఎస్‌లు కేవీఎస్ జవహర్ రెడ్డి, పూనం మాలకొండయ్య వంటి వారికి కూడా గతంలో పదవీ విరమణకు ముందు పోస్టింగ్‌లు లభించాయి.మొత్తం మీద శ్రీలక్ష్మి విషయంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. సర్వీస్ నిబంధనలను గౌరవించడమే కాకుండా అధికారులలో నూతన ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని పెంచేదిగా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి మూసీ రివర్ ఫ్రంట్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. మూసీ మొదటి దశ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. భూ సేకరణ కోసం ఆసక్తిగా ఉన్న వారికి టీడీఆర్ లేదా పరిహారం చెల్లించాలని రేవంత్ చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న రక్షణ శాఖ భూముల్లో ఉన్న కార్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వమే తరలించాలన్నారు. ప్రజల సందర్శన కోసం నెక్లెస్ రోడ్డులో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూసీ ప్రాజెక్టులో చేపట్టబోయే పనులు ఇందులో ప్రతిబింబించాలని అన్నారు. ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎండీ నర్సింహారెడ్డి, ఎంఆర్డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేపు మార్కాపురం జిల్లాకు సీఎం చంద్రబాబు..

జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులతో కొద్దిసేపు సమావేశమైన అనంతరం, ఉదయం 11 గంటలకు వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆయన పరిహారం చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:20 వరకు నిర్వాసితులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12:55 గంటలకు గిద్దలూరు నియోజకవర్గంలోని కిష్టంశెట్టిపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన సంజీవిని ఆసుపత్రిని ప్రారంభించి, వైద్యులు, సిబ్బందితో సమావేశమవుతారు. ఆసుపత్రి ప్రారంభోత్సవం అనంతరం జరిగే బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఆ తర్వాత స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో 'గార్డెన్ మీటింగ్'లో పాల్గొని అభివృద్ధి అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం 5:15 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో గుంటూరుకు తిరుగుపయనమవుతారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# శిథిలాల కింద 50,000 మంది?

(మొదటి పేజీ తరువాయి)

40 వేల మంది గల్లంతు.. వెనెజువెలా భూకంపంలో 589కి చేరిన మృతుల సంఖ్య వెనెజువెలాలో సంభవించిన జంట భూకంపాల్లో మృతులు, గాయపడినవారు, గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తులో ఇప్పటివరకూ 589 మంది మృతి చెందారని, 4,300 మంది గాయపడ్డారని ఆ దేశ ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది.

**40 వేల మంది గల్లంతు.. వెనెజువెలా భూకంపంలో 589కి చేరిన మృతుల సంఖ్య**

కారకాస్: వెనెజువెలాలో సంభవించిన జంట భూకంపాల్లో మృతులు, గాయపడినవారు, గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తులో ఇప్పటివరకూ 589 మంది మృతి చెందారని, 4,300 మంది గాయపడ్డారని ఆ దేశ ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. భవనాల శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయారని, 40 వేల మందికిపైగా ప్రజల జాడ తెలియడంలేదని పేర్కొంది. భూకంపానికి తీవ్రంగా ప్రభావితమైన లాగువేరాలో పరిస్థితి దయనీయంగా ఉందని వివరించింది. ఇక్కడ వందకుపైగా భారీ భవనాలు నేలమట్టమైనట్లు ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు వెల్లడించారు.

**'ఆపరేషన్ అమిస్టాడ్' పేరుతో భారత్ సాయం**

జంట భూకంపాలతో అతలాకుతలమైన వెనెజువెలాను ఆదుకునేందుకు 'ఆపరేషన్ అమిస్టాడ్' పేరుతో భారత్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నదని విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ తెలిపారు. దీనిలో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత్ సైన్యానికి చెందిన రెండు సీ17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు. సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్ క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు రెండు మొబైల్ ఆస్పత్రి టెంట్లు, 25 టన్నులకుపైగా సహాయక సామగ్రి పంపినట్లు తెలిపారు.

**శిథిలాల్లో శిశువు జననం**

భూకంపం సంభవించిన లాగువైరా ప్రాంతంలో శిథిలాల్లో చిక్కుకున్న ఒక మహిళ శిశువుకు జన్మనిచ్చింది. రెండు రోజుల పాటు భవనపు శిథిలాల్లో చిక్కుకుపోయిన ఆమెను రెస్క్యూ సిబ్బంది బయటకు తీసుకువచ్చారు. స్థానికులు ఆ శిథిలాల్లోనే ఆమెకు పురుడు పోశారు. దీనికి సంబంధించిన వీడియోను చూసిన వారంతా కంట తడి పెట్టుకుంటున్నారు.

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు...

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలు సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉద్ధృతం చేసింది.ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. "ఛడ్ దే ఇండియా", "రాహుల్ ఇన్ పారిస్", "పరదేశ్" వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను 'పర్యటనల నేత'గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ "స్వదేశ్ వర్సెస్ పరదేశ్" పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది.బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు.అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది.

# కెమెరాలు కవర్ చేసి.. అందినంత కొట్టేసి..

(మొదటి పేజీ తరువాయి)

అయోధ్య: అయోధ్య రామ మందిరం విరాళాల్లో అవకతవకల కేసులో రోజుకో కొత్త కోణం బయటకొస్తోంది. సిట్ నివేదిక ప్రకారం నిందితులు డబ్బులు, కానుకలు ఎలా దొంగిలించారో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విరాళాలను లెక్కించే సిబ్బందిలో ఒకరు సీసీ కెమెరాలకు అడ్డంగా నిలబడగా.. మరొకరు డబ్బులను దొంగిలించి తన లోపలి దుస్తుల్లో దాచుకున్నాడని.. ఇలా కోట్లాది రూపాయలు మిస్ అయినట్టు సిట్ నివేదికలో వెల్లడైంది. అధికారులు జాతీయ మీడియాకు ఇచ్చిన సమాచారం ప్రకారం.. విరాళాల బ్యాంకు వివరాలను సమీక్షించినప్పుడు ట్రస్టు అధికారులకు అనుమానం వచ్చింది. సాధారణంగా ఒక విరాళాల పెట్టెలో రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఉంటాయి. అయితే కొన్ని పెట్టెల్లో మాత్రం రూ.500 నోట్ల కట్టలు తక్కువగా ఉండటాన్ని అధికారులు గమనించి లెక్కింపు గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అక్కడ ఒక వ్యక్తి సీసీ కెమెరాలకు కొన్ని వారాల పాటు అడ్డంగా నిలబడటం అధికారులు గుర్తించారు. అలా నిలబడ్డప్పుడు మరో ఉద్యోగి డబ్బులను తన దుస్తుల్లో దాచుకునేవాడు. ఇలా కోట్ల రూపాయలు దోచేశారు.

**బ్యాంకుకు తరలించేటప్పుడు..**

కేవలం లెక్కింపు గదిలోనే కాకుండా ఇంకో విధంగా కూడా విరాళాలు పక్కదారి పట్టినట్టు సిట్ దర్యాప్తులో తేలింది. కౌంటింగ్ స్టాఫ్ నోట్ల కట్టల్లో ఉండాల్సిన దాని కంటే ఎక్కువ నోట్లను చొప్పించేవారు. బ్యాంకులకు తరలించే క్రమంలోనే సిబ్బంది ఆ కట్టల నుంచి ఎక్కువగా ఉన్న నోట్లను తీసుకునేవారు. అప్పుడు వోచర్లకు సరిపడా మొత్తం బ్యాంకులో జమ అయ్యేది.

# తుంగభద్ర జలాలు రేవంత్ సర్కార్‌పై రాంచందర్ రావు ఫైర్



రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన చర్చల్లో ఏయే అంశాలను ప్రస్తావించారో వివరాలను బహిర్గతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర డ్యామ్‌కు ఇటీవల 33 కొత్త స్పిల్‌వే గేట్లను అమర్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ హాజరయ్యారు. గేట్ల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపులపై కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని రామచంద్రరావు సూచించారు. రెండు కీలక ప్రాజెక్టుల కింద తెలంగాణకు 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, అధికారిక లెక్కల ప్రకారం కేవలం 5 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కంటే తక్కువ నీటికి గతంలో కేసీఆర్ సంతకం చేశారని ఆయన ఆరోపించారు. 'సర్' ప్రక్రియపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను రామచందర్ రావు తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఐడీ కార్డు ఉంటేనే 'ఎస్ఐఆర్' చెల్లుతుందా? పాస్‌పోర్ట్ చెల్లదా? అని ఒవైసీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. పాస్‌పోర్ట్ అనేది ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని, అది పౌరసత్వానికి నిరూపణ కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేశారు. దలైలామా వద్ద కూడా ఎల్లో పాస్‌పోర్ట్ ఉందని, అంతమాత్రాన ఆయనకు భారత పౌరసత్వం ఉన్నట్లు కాదని పేర్కొన్నారు. 'సర్' ప్రక్రియలో గుర్తింపు కోసం 12 రకాల ధృవీకరణ పత్రాలను సమర్పించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్ల పండగ..

ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆ శాఖ అధికారులకు మరో తీపికబురు అందించారు. తాజాగా 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు (ఎంపీడీవోలు), డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా (డీడీవోలు) పదోన్నతులు కల్పించే ప్రక్రియకు పచ్చజెండా ఊపారు. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదించింది. దీంతో త్వరలోనే వీరందరూ ఉన్నత హోదాలో బాధ్యతలు చేపట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందికి ప్రమోషన్లు కల్పించారు. గత పదేళ్లలో ఇంత భారీ సంఖ్యలో ఈ శాఖలో పదోన్నతులు ఇవ్వడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.

**వర్షాకాలంపై కీలక సమీక్ష.. పవన్ కీలక ఆదేశాలు**

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. "వర్షాకాలంలో నిలిచి ఉన్న నీటితో దోమలు పెరిగి, పైపులైన్ల లీకేజీల వల్ల తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామ పంచాయతీ ప్రజారోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి.



# హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార ధరలు తగ్గించాలి

**మెట్టు శ్రీధర్.. తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల ప్రధాన కార్యదర్శి డిమాండ్**

**హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై ఉన్న పరిమితులను తొలగించిన నేపథ్యంలో, గతంలో గ్యాస్ కొరతను కారణం చూపుతూ పెంచిన ఆహార పదార్థాల ధరలను హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల యాజమాన్యాలు వెంటనే తగ్గించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ కోరారు. శుక్రవారం పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత, అధిక ధరల కారణంగా టిఫిన్లు, భోజనాలు, ఇతర ఆహార పదార్థాల ధరలను పెంచిన హోటల్ యాజమాన్యాలు ప్రస్తుతం గ్యాస్ సరఫరా సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ అదే ధరలను కొనసాగించడం సరికాదన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని హోటల్ యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో వ్యవహరించి ఆహార ధరలను తగ్గించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లలో అమలవుతున్న ధరలపై పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు న్యాయమైన ధరలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంబంధిత ప్రభుత్వ శాఖలకు తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితి ద్వారా విజ్ఞప్తి చేశారు.

# పాత హోంగార్డులను తొలగించాలి

**దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలి**

**బాసర ఆలయ ఈఓకి వినతి పత్రం**



**బాసర మండలం:** నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో గత మూడు రోజుల క్రితం శ్రీ మహాకాళి అమ్మవారి ఆలయంలో జరిగిన దొంగతనానికి కారకులైన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని, అలాగే బాసర ఆలయంలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న హోమ్ గార్డులను తొలగించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆలయ ఈవో అంజన దేవి వినతి పత్రం అందజేసిన బాసర వీడిసి అధ్యక్షులు నూకం లింగరావు, కమిటీ సభ్యులు బల్గురి నర్సింగ్ రావు, ఓంకార్ దేశాయ్, సంజీవ్ పటేల్, గురప్పా శంకర్, అశోక్, ధావు రాజు, రత్నెల్లి రమేష్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాసర అమ్మవారికి పుట్టింటి పట్టుచీరలు సమర్పించిన వీడీసీ పెద్దలు



**బాసర న్యూస్, 26 జూన్:** నిర్మల్ జిల్లా బాసర పవిత్రమైన పుణ్యక్షేత్రం శ్రీ జ్ఞాన సరస్వతి విత్తనాలు నాటిన చేతులే భక్తుల ఆకలి తీరుస్తున్న సందర్భంగా గత 108 సంవత్సరాల నుండి తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ,గ్రామ రైతులు యువకులు,సరస్వతీ,మహాకాళి,మహాలక్ష్మి అమ్మవార్లకు పుట్టింటి పట్టుచీరను సమర్పించారు. వర్షాకాలం ఆరంభ సమయంలో విత్తనాలు విత్తే ముందు మహా బండారాను నిర్వహించడం బాసరలో ఆనవాయితీగా వస్తున్న ఆచారం. మహా బండారాలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు. మహాబండారాలు ప్రసాదాన్ని స్వీకరిస్తే ఎన్నో వైన్ల రోగాలు నయమవుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. మహాబండారా లో వేల సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.



# తెలంగాణ సంస్కృతికి ప్రతీక మొహర్రం పర్వదినం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరువు:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు, గంగా జమున తెహజీబ్ సంస్కృతికి మొహర్రం ప్రతీక అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మొహర్రం పర్వదినం పురస్కరించుకొని జి ఎం ఆర్ యువసేన నాయకులు షకీల్ ఆధ్వర్యంలో శుక్రవారం పటాన్ చెరువు పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..త్యాగ నిరతికి, సహనానికి ప్రతీక మొహర్రం.పీర్ల రూపంలోని అమరవీరుల సంస్మరణం.. అన్ని మతాల ఐక్యతకు సఖ్యతకు చిహ్నం మొహర్రం అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, వెంకటేష్, మిరాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



# రిజర్వేషన్ల పితామహుడు చత్రపతి సాహు మహారాజ్

**నేటి యువత చరిత్రను మరచిపోవద్దు**

**బిఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్**



**నిర్మల్ టౌన్, 26 జూన్:** నిర్మల్ జిల్లా కేంద్రంగా చత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలు నిర్మల్ జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నందు నిర్వహించారు,చత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జన్మదిన ఘన నివాళులు అర్పించారు, కార్యక్రమాన్ని ఉద్దేశించి నిర్మల్ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్ మాట్లాడుతూ కొల్హాపూర్ సంస్థానంలో బహుజనులకు రిజర్వేషన్స్ ఇచ్చి సంస్థానాన్ని సామాజిక సంస్థానంగా మార్చి ఆదర్శంగా నిలిచారన్నారు.గౌతమ బుద్ధుడు, కబీర్ దాస్, మహాత్మ జ్యోతిబాపూలే, ఆశయాలను ఆలోచనలను ఆచరణాత్మకంగా చూపిన చత్రపతి సాహుజీ మహారాజ్ అని కొనియాడారు, కొల్హాపూర్ సంస్థానంలో 50 శాతం రిజర్వేషన్లు అమలుపరిచి, శాసనము చేసి మొట్టమొదట సారిగా బహు జనులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన మహనీయుడు చత్రపతి సాహుజీ మహారాజ్ అని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ విద్యకు, సహకారం అందించడమే కాక ముక్ నాయక్ పత్రికకు అండగా నిలిచారనీ, 1920 సంవత్సరములోనే దక్కన్ అస్పృశ్య సమాజ సమ్మేళన సభలో భవిష్యత్తు అంతా కూడా అంబేద్కర్ ఆశయాలతోనే ముందుకు సాగుతుందని ముందే తెలిపారని,కోల్లాపూర్ సంస్థానంలో ఉద్యోగాలు ఇస్తూ భూములకు పట్టాలిచ్చారన్నారు,అంటరానితనం నిర్మూలనకు పాటుపడిన మానవతావాది అని,వితంతు వివాహ చట్టం తెచ్చి,కుల నిర్మూలన కోరకై కులాంతర వివాహాలు ప్రోత్సహించారని కొనియాడారు.నేటి యువత చత్రపతి సాహుజీమహారాజ్ ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జగన్ మోహన్ జిల్లా అద్యక్షులు,ప్రదాన కార్యదర్శి చింతకుంట రాజేశ్వర్,ఉపాధ్యక్షులు లక్ష్మీ యాదవ్,జిల్లా కార్యదర్శి చెరుకు రాజ్యం,కోశాధికారి పడిగెల రాజేష్,జిల్లా సభ్యులు కాటం ప్రభాకర్,ఖానాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ జోసఫ్ గంగారాం,ముదోల్ నియోజకవర్గం ఇంచార్జ్ పవార్ లక్షణ్,ఖానాపూర్ అధ్యక్షులు అంకంపేట గంగాధర్,నిర్మల్ నియోజకవర్గం అధ్యక్షులు క్యాతం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మొహరం సందర్భంగా షర్బత్ పంపిణీకార్యక్రమంలో పాల్గొన్న ఎం డి ఆర్ ఫౌండేషన్ అధినేత పృధ్వీరాజ్



**పటాన్చెరు, జూన్ 26, :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగినటువంటి మొహరం పండుగ సందర్భంగా మత సామరస్యం, సోదరభావానికి ప్రతీకగా పటాన్చెరు పట్టణ బస్టాండ్ సమీపంలో బీఆర్ఎస్ నాయకుడు షకీల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షర్బత్ పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఎండిఆర్ ఫౌండేషన్ అధినేత మాద్రి పృధ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాద్రి పృధ్వీరాజ్ స్వయంగా ప్రజలకు షర్బత్ పంపిణీ చేసి మొహరం పండుగ శాంతి, త్యాగం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, పరస్పర ప్రేమాభిమానాలు, సోదరభావంతో సమాజం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎండిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు దాసరి మధు,నాయకులు, మత పెద్దలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టెట్ పై భయాందోళనలు వీడండి

**యుటిఎఫ్ టెట్ కోచింగ్ ప్రారంభోత్సవంలో డీఈవో షేక్ షంషుద్దీన్**

బద్వేలు: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పై భయాందోళనలు వీడాలని కడప జిల్లా డీఈవో షేక్ శంషుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కడపలోని యుటిఎఫ్ భవన్లో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టెట్ ఉచిత కోచింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎన్సీటిఈ మార్గదర్శకాలకు అనుగుణంగా 2028 ఆగస్టు 31 లోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాల్సి ఉందని, దీనిపై కొందరు ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొని ఉందని ఆయన పేర్కొన్నారు. టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయులకు ఆందోళన అవసరమేలేదని, బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడం పెద్ద సమస్యేమి కాదన్నారు. అయితే విద్యాబోధన ఒకవైపు, కుటుంబ బాధ్యతలు మరొక వైపు చూస్తూ టెట్ పరీక్షకు ప్రిపేర్ కావడం కొంత ఇబ్బందికరమని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భంలో ఉపాధ్యాయుల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉందన్నారు. ఇందులో భాగంగా యుటిఎఫ్ ఉపాధ్యాయులకు ఉచిత కోచింగ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. గతంలో కూడా యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన నిరుద్యోగులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ను నిర్వహించి నిరుద్యోగుల మన్ననలను అందుకున్నారన్నారు.



# అల్లుడితో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని.. భర్తను హత్య చేసిన భార్య

నాగర్ కర్నూలు: సొంత అల్లుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అడ్డుకుగా వున్నాడని భర్తనే కడతేర్చింది. మొదట అనారోగ్యంతో మరణించాడని భావించిన ఘటనలో పోలీసులు విచారణ అనంతరం ఇది హత్యగా తేల్చారు. నాగర్కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామానికి చెందిన అమ్మపల్లి యాదయ్య, అలివేలు దంపతులు. అలివేలుకు తమ సొంత అల్లుడు ఆంజనేయులతో వివాహేతర సంబంధం ఏర్పడడంతో.. ఈ విషయం తెలుసుకుని తరచూ యాదయ్య భార్యతో గొడవపడుతున్నాడు. ఈ నెల 23న యాదయ్య ఇంట్లో మృతిచెందగా.. అనారోగ్యంతో మృతి చెందాడని కుటుంబ సభ్యులను, గ్రామస్తులను భార్య నమ్మించింది. అయితే అంత్యక్రియలకు ముందు శవానికి స్నానం చేయించి దుస్తులు మారుస్తుండగా శరీరంపై గాయాలు కనిపించడంతో అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి అన్న కుమారుడు పరశురాములు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు విచారణ చేపట్టి ప్రశ్నించగా.. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో అతని మర్మాంగాలపై దాడి చేసి హత్య చేసినట్లు భార్య అలివేలు ఒప్పుకుంది. అదే రోజు కూతురు, అల్లుడు కూడా ఇంటికి వచ్చి వెళ్లిన నేపథ్యంలో వారి పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో బంధువులు పేర్కొన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# అయోధ్య రామ జన్మభూమి విరాళాల సేకరణలో రూ. 200 కోట్ల అవినీతి జరిగింది: ఎంపీ చామల

యోగి ఆదిత్యనాథ్ సీఎం పదవికి రాజీనామా చేయాలని చామల డిమాండ్

విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపాటు

మమత, థాకరేలకు చెందిన ఎంపీలను ఈ సొమ్ముతోనే కొనుగోలు చేశారని ఆరోపణ

అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల సేకరణలో ఏకంగా రూ. 200 కోట్ల భారీ అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పినప్పటికీ... యూపీ సిట్ పోలీసులు ఆయన సొంత మనుషులనే అరెస్ట్ చేశారని తెలిపారు. కేవలం చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను పదవుల నుంచి తప్పించి బీజేపీ చేతులు దులుపుకుంటే సరిపోదని, ఈ స్కామ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని, దేవుడి కోసం సేకరించిన విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని చామల మండిపడ్డారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి చెందిన 20 మంది ఎంపీలను, మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రేకు చెందిన ఆరుగురు ఎంపీలను ఒక్కొక్కరికీ రూ. 75 కోట్లు ఇచ్చి కొనుగోలు చేయడానికి ఈ రాముడి సొమ్మునే వాడారంటూ తీవ్రస్థాయిలో ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని... ఇప్పుడు చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను కేవలం పదవుల నుంచి తప్పిస్తే సరిపోదని అన్నారు.



# 27 రోజుల జైలు నిర్బంధం తర్వాత.. కేటీఆర్‌ను కలిసిన బాల్క సుమన్



సింగరేణిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసు

చంచల్‌గూడ జైల్లో 27 రోజులు ఉన్న బాల్క సుమన్

బాల్క సుమన్‌కు ధైర్యం చెప్పిన కేటీఆర్

దాదాపు నెల రోజుల పాటు జైల్లో ఉన్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ గురువారం సాయంత్రం చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈరోజు ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలోనే ఆయనను అరెస్ట్ చేశారు. ఈ కేసుల వల్ల ఆయన ఏకంగా 27 రోజుల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. కేటీఆర్‌ను కలిసిన సందర్భంగా... తన జైలు అనుభవాలు, తదుపరి న్యాయపోరాటం గురించి చర్చించారు. ఈ కష్టకాలంలో పార్టీ తనకు అండగా నిలిచినందుకు కేటీఆర్‌కు థాంక్స్ చెప్పారు. బాల్క సుమన్‌ను కేటీఆర్ ఆత్మీయంగా హత్తుకుని, ధైర్యం చెప్పారు.

# ఘనంగా ప్రారంభమైన రొట్టెల పండుగ..

ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి నారాయణ

నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద ప్రారంభమైన రొట్టెల పండుగ

స్వర్ణాల చెరువులో రొట్టెను వదిలి పట్టుకున్న నారాయణ



అందరూ సుఖంగా ఉండాలని సంకల్పించి రొట్టెను పట్టుకున్నానన్న మంత్రి

నెల్లూరు జిల్లాలోని ప్రసిద్ధ బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఘనంగా మొదలైంది. మంత్రి నారాయణ ఈ రొట్టెల పండుగ ఏర్పాట్లను సమీక్షించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కూడా ఆయన పరిశీలించారు. అనంతరం స్వర్ణాల చెరువులో రొట్టెను వదిలి, ఆపై పట్టుకున్నారు. ఆ తర్వాత దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ... "412 సంవత్సరాల చారిత్రక నేపథ్యం ఉన్న ఈ దర్గాకు ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. 2014కి ముందు సుమారు 4 లక్షల మంది మాత్రమే వచ్చేవారు, వసతులు సరిగా లేవు. ఇప్పుడు వసతి సౌకర్యాలు, అభివృద్ధి పనులు భారీగా చేపట్టాం" అని తెలిపారు. గత ప్రభుత్వం దర్గా అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించిన మంత్రి, నెల్లూరు బారాషహీద్ దర్గాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. దేశ-విదేశాల నుంచి భక్తులు నమ్మకంతో వస్తున్నారన్నారు. చెరువు నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని.. 6,315 మున్సిపల్ సిబ్బంది.. 1,870 పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భద్రతకు గజ ఈతగాళ్లను సిద్ధం చేశామని, బోట్ షికారు కోసం 8 రకాల బోట్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని, అందరూ సుఖంగా ఉండాలని సంకల్పించి రొట్టె పట్టుకున్నట్లు మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు.

# ఆసుపత్రిలో ముద్రగడను పరామర్శించిన బొత్స, తోట త్రిమూర్తులు

కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న ముద్రగడ

హైదరాబాద్ లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ నేత

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన బొత్స, తోట త్రిమూర్తులు



మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల సత్వర పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. ఈ వార్త తెలియగానే పలువురు వైసీపీ సీనియర్ నేతలు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈరోజు ఆసుపత్రికి వెళ్లారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల నుంచి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముద్రగడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం పట్ల వైసీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# హైదరాబాద్ 'గోల్డ్ మ్యాన్' పై చీటింగ్ కేసు


'గోల్డ్ మ్యాన్' సూర్య భాయ్‌పై చీటింగ్ ఆరోపణలతో కేసులు

సీఎం, పోలీస్ కమిషనర్ పేర్లు చెప్పి బంగారం ఇప్పిస్తానని మోసం

రూ.32 లక్షలు తీసుకుని బాధితులను బెదిరించినట్టు ఫిర్యాదు

విచారణలో నకిలీ బంగారంగా తేలిన సూర్య భాయ్ ఆభరణాలు

కోటి రూపాయలని చెప్పిన నగల విలువ రూ.3 లక్షలేనని నిర్ధారణ



సోషల్ మీడియాలో ఒంటినిండా బంగారంతో మెరిసిపోతూ 'గోల్డ్ మ్యాన్'గా గుర్తింపు తెచ్చుకున్న పి. సురేశ్ కుమార్ అలియాస్ సూర్య భాయ్‌పై హైదరాబాద్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. తక్కువ ధరకే దిగుమతి చేసుకున్న బంగారం ఇప్పిస్తానని చెప్పి పలువురిని మోసగించినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తనకు అత్యంత సన్నిహితులని నమ్మించి, మార్కెట్ రేటు కంటే తక్కువకే బంగారం ఇస్తానని చెప్పి డబ్బులు వసూలు చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకున్నాక బంగారం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక బాధితుడి నుంచి రూ.32 లక్షలు వసూలు చేసిన సూర్య భాయ్, ఆ తర్వాత బంగారం ఇవ్వలేదు. బాధితులు అతని ఇంటికి వెళ్లి నిలదీయగా, వారికి మూడు ఐఫోన్లు ఇచ్చి, రూ.20 లక్షలకు చెక్కు రాసిచ్చాడు. అయితే, ఆ తర్వాత వారిని బెదిరించి ఫోన్లను తిరిగి లాక్కున్నట్టు బాధితులు తమ ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై మొదట అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, కేసును నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో పాటు పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేసినందుకు గాను సూర్య భాయ్‌పై మరో కేసు కూడా నమోదైంది. అతను ఇచ్చిన సమాచారం అవాస్తవమని తేలడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ మోసాల వెనుక ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అత్తాపూర్‌లో నివసించే 34 ఏళ్ల సూర్య భాయ్, ఒంటినిండా బంగారు ఆభరణాలు ధరించి, తెల్లటి దుస్తుల్లో గుళ్లకు వెళ్లే వీడియోలతో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యాడు. ఈ ఏడాది మార్చిలో ఆదాయపన్ను శాఖ అధికారులు అతనిపై దృష్టి సారించారు. అయితే, వారి తనిఖీల్లో అతను ధరించిన ఆభరణాల్లో చాలా వరకు నిజమైన బంగారం కాదని, చౌకబారు లోహాలతో చేసిన నకిలీవని తేలింది. తాను కోటి రూపాయల విలువైన నగలు ధరించినట్లు అతను చెప్పుకున్నప్పటికీ, అధికారులు జరిపిన విచారణలో వాటి విలువ కేవలం రూ.3 లక్షలు మాత్రమేనని తేలడం గమనార్హం.

# డ్రగ్స్ నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత

**గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి. "**

వరంగల్: డ్రగ్స్ నియంత్రణ ప్రభుత్వం బాధ్యతే కాదు తల్లితండ్రులు వైద్యులు పోలీసులు మేధావులు స్వచ్ఛంద సంస్థలు సినీ ప్రముఖులుఉపాధ్యాయులు అందరి బాధ్యత అని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అని అన్నారు. శుక్రవారం హంటర్ రోడ్డు లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అరికట్టాలంటే నార్కోటి కంట్రోల్ రూమ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాల కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నార్కటి కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు డ్రగ్స్ ని అమ్మేవారిని పై కఠిన చర్యలు తీసుకుంటూ వారికి కౌన్సిలింగ్ ద్వారా మంచి మార్గంలో నడిచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుంది జిల్లాలలో కమిషనర్ ఎస్పీ కలెక్టర్ వాళ్ళ చెరువుతో మాదకద్రవ్యాలను అరికట్టడం అర్హనీయం ముఖ్యంగా సప్లై చేస్తే ఏరియాలో కాలేజీలు సినిమా హాలు కేసులు క్లబ్బులు హాస్టల్స్ దగ్గర నిఘా ఏర్పాటు చేయాలి ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా కాకుండా బార్డర్లలో సరైన జాగ్రత్తలు తీసుకొని ఎవరైతే గంజాయి రవాణా చేస్తారో వారిని పట్టుకొని వారిపై కఠిన చర్యలుతీసుకోవాల్సిందిగా కోరుతున్నాను డ్రగ్స్ అంతరించాలంటే మాదకద్రవ్యాలు అరికట్టాలంటే ప్రతి ఒక్కరు వారి భుజాల మీద వేసుకొని దానిపై పోరాడితేనే తప్ప అది అరికట్టలేమని రాజనాల శ్రీహరి అన్నారు. వెంటనే ప్రభుత్వం ప్రజలు అధికారులు అందరూ చొరవతో డ్రగ్స్ ను గంజాయిని మాదకద్రవ్యాలను అరికట్టాల్సిందిగా రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో పోలేపాక ప్రసాద్ తులసి శశి మాగంటి శివగంద్రకోట రామచందర్ లో పాల్గొన్నారు

# హైదరాబాద్ కు చెందిన నలుగురు మాచర్లలో రోడ్డు ప్రమాదంలో మృతి

**పల్నాడు:** మాచర్ల పట్టణం నగరవనం వద్ద ఈరోజు ఉదయం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని తుఫాను వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తుఫాన్లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడ మృతి చెందారు. మృతులు హైదరాబాద్ నుండి కనిగిరి వెళ్తున్న క్రమంలో జరిగిన ఘటన చోటు చేసుకుంది. మృతులు కదిరి వెంకటేశ్వర్లు, కదిరి శారద, పిడుగు సత్యనారాయణ, పిడుగు అంజలి గా గుర్తించారు.

# షేర్‌గూడలో ఉచిత మెడికల్ క్యాంప్

**ప్రజలకు వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ**

**రంగారెడ్డి జిల్లా జూన్ 26:** డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షేర్‌గూడ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఘనంగానిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఫార్మసీ విద్యార్థులు మరియు వాలంటీర్లు సేవలందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వివిధ ప్రాంతాల్లో నిరంతరం నిర్వహిస్తోందని సొసైటీ ఎక్స్ గ్యుటీ మెంబర్ జి.మాధవి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందం, వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# తాడిపత్రిలో మళ్లీ ఉద్రిక్తత.. పెద్దారెడ్డి గృహనిర్బంధం

**తాడిపత్రిలోని గాంధీ విగ్రహం వద్ద సామూహిక దీక్ష చేపడతామన్న పెద్దారెడ్డి వర్గీయులు**

**వైసీపీ దీక్షను అడ్డుకుంటామన్న జేసీ వర్గీయులు.. తాడిపత్రిలో భారీగా మోహరించిన పోలీసులు**



అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గాలు పోటాపోటీగా నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తగా పెద్దారెడ్డిని గృహనిర్బంధం చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే... తాడిపత్రిలోని ప్రధాన కూడలి అయిన గాంధీ విగ్రహం వద్ద సామూహిక దీక్ష చేపడతామని పెద్దారెడ్డి వర్గీయులు ప్రకటించారు. అయితే, ఈ దీక్షను ఏమాత్రం సాగనివ్వబోమని, తాము అడ్డుకుంటామని జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులైన టీడీపీ నేతలు స్పష్టం చేశారు. ఇదే సమయంలో జేసీ వర్గం మరో అడుగు ముందుకేసి.. అనంతపురంలో ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యేల ఇళ్ల ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేస్తామని ప్రకటించడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. జిల్లాలో ఒకవైపు మొహరం వేడుకలు, మరోవైపు వీవీఐపీల పర్యటనలు ఉండటంతో... ఇరువురు నేతల కార్యక్రమాలకు అదనపు రక్షణ కల్పించడం సాధ్యం కాదని పోలీసులు తేల్చి చెప్పారు. ఇరు వర్గాల నిరసనలకు అనుమతి నిరాకరించారు. ప్రజా శాంతికి సహకరించాలంటూ ఇరుపక్షాల నేతలకు ముందస్తుగా లీగల్ నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగానే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు ఆయన ఇంట్లోనే గృహ నిర్బంధం చేశారు. ఆయన నివాసం చుట్టూ, అలాగే తాడిపత్రిలోని గాంధీ సర్కిల్, సున్నితమైన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తగా భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/